## క్లుప్తంగా

### వైద్యశిబిరానికి విశేష స్పందన



బాపట్ల: బాపట్ల యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ముత్తాయపాలెంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య సేవలు అందించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు యజ్ఞ హస్పిటల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. మొత్తం 600 మంది ఈవైద్యసేవలను ఉపయోగించుకున్నారు.

### చిలుమూరు వాసులకు దుస్తులు పంపిణీ



కొల్లూరు : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్ నేతృత్వంలో దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మండలంలోని చిలుమూరులో నిర్వహించిన కార్యక్రమంలో 350 మందికి చీరలు, దుప్పట్లు, కండువాలు, లుంగీలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకుడు కె.ఎస్.రాజు, దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి బాబూరావు, విశ్రాంత రైల్వే ఉద్యోగి సతీష్‌కుమార్, జైభీమ్ దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రార్థనా మందిరానికి కుర్చీలు, ఫ్యాన్ బహూకరణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలోని ప్రార్థన మందిరానికి విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరిశ వెంకటేశ్వరరావు ఆదివారం దైవ సేవకులకు కుర్చీలు, ఫ్యాన్ అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరిశ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

### హిందూ ధర్మం విశ్వజనీయం

సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు



తెనాలి: సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి రూరల్, కొల్లిపర మండలాలకు చెందిన గ్రామ కన్వీనర్ల ఒక రోజు శిక్షణా తరగతులు ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో నిర్వహించారు. తెనాలి ఖండ ప్రముఖ్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మం విశ్వజనీయం అన్నారు. ప్రపంచశాంతిని కోరుకుంటున్న హిందూ ధర్మం సనాతనమైనదని చెప్పారు. భగవద్గీత ప్రపంచంలో అత్యుమైన వ్యక్తిత్వ వికాస గ్రంథమని చెబుతూ రామాయణం మానవాళికి మార్గదర్శిగా మానవ నడవడికను తెలియజేసి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంతటి విశిష్టమైన హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన భాధ్యత గ్రామ కన్వీనర్లదేనని స్పష్టంచేశారు. హనుమత్ ప్రసాద్, అప్పికట్ల వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ విజ్జల సునీత, నందికంటి రామాంజనేయులు, మోదడుగు పవన్ రెడ్డి, క్రాప రవికుమార్, సమరసత సేవ ఫౌండేషన్ గ్రామ ధార్మిక సభ్యులు పాల్గొన్నారు.

### గంజాయి విక్రేత అరెస్ట్

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రామలింగేశ్వరపేట పాత డిపో ప్రాంతానికి చెందిన నీలం సాయితేజ గంజాయి విక్రయిస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందింది. అతనిపై నిఘా ఉంచగా కబేళా వంతెన వద్ద అతన్ని ఆదివారం అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1135 గ్రాముల గంజాయి లభించింది. నిందితుడిని అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు తెలిపారు.

### బద్వేల్ దోషులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్ : కడప జిల్లా బద్వేలులో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమపేరుతో పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో మహిళలకు ఏ మాత్రం భద్రత లేని స్థితిలో ఉందని పేర్కొన్నారు.

# మృత్యుటపాసులు

## పొంచి ఉన్న ప్రమాదం

## యథేచ్ఛగా బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు

- గతంలో చేదు అనుభవాలెన్నో..!
- అయినా పట్టించుకోని పోలీసులు, అధికారులు
- కొరవడిన నిఘా..
- ముందస్తు చర్యలు చేపట్టని వైనం

రేపల్లె రూరల్: మందుగుండు సామగ్రి, బాణసంచా తయారీ ప్రమాదాలకు దారితీస్తున్నా.. ప్రాణాలను బలితీసుకుంటున్నా.. కొందరు టపాసుల తయారీని వదలడం లేదు. రేపల్లె మండలంలోని పేటేరుతోపాటు పలు గ్రామాల్లో దీపావళి వచ్చిందంటే చాలు పలు కుటుంబాలు టపాకాయల తయారీకి పూనుకుంటాయి. సాధారణంగా బాణసంచా తయారీకి ముందుగా అధికారుల అనుమతి తీసుకోవాలి. జనావాసాలకు దూరంగా తయారు చేయాలి. నిబంధనలు పాటించాలి. కానీ ఇవేమీ లేకుండా జనావాసాల మధ్యలోనే కొందరు టపాసులు తయారు చేస్తున్నారు. రేపల్లె ఓల్డ్‌టౌన్, ఇసుకపల్లి, పేటేరు తదితర ప్రాంతాల్లో గతంలో మందుగుండు తయారు చేస్తున్న క్రమంలో జరిగిన పేలుళ్లకు పలువురు మృత్యువాత పడ్డారు. అయినా ఈ ప్రాంతాల్లో కొందరి తీరు మారడం లేదు. ఇప్పటికీ పేటేరులో ఓ అరడజను మంది బాణసంచా తయారు చేస్తున్నట్టు సమాచారం.




2015లో పేటేరులో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన గృహం (ఫైల్)





2015లో పేటేరులో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడిన వ్యక్తి (ఫైల్)



### తాటాకు టపాకాయ కేరాఫ్ పేటేరు

పేటేరు టపాకాయ అంటే రాష్ట్రంలోనే ప్రసిద్ధి. ఇక్కడ తయారయ్యే తాటాకు టపాకాయను దీపావళికి పేల్చేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తారు. అందుకే ఇక్కడ తాటాకు టపాకాయల తయారీని కొందరు ఉపాధిగా మలచుకుంటారు. అనుమతి లేకుండా తాటాకు టపాకాయల తయారీకి ముడిసరుకు సేకరణ, నిల్వ పెద్ద సవాలు. 2015లో ఈ గ్రామంలో పెద్ద ఎత్తున ముడిసరుకు దాచిపెట్టి పెద్ద ఓ వ్యక్తి పెద్ద ప్రమాదానికి కారణమయ్యాడు. పండుగకు కొన్ని నెలల ముందే ముడిసరుకు కొనుగోలు చేసి తన ఇంట్లో గచ్చు అడుగు భాగంలో దాచిపెట్టాడు. పండుగ దగ్గరకొచ్చేసరికి 2015 సెప్టెంబర్ 24న ఆ వస్తువులను వెలికితీసి టపాకాయలు తయారీకి ఉపక్రమించాడు. గచ్చును నెమ్మదిగా పగలుగొడుతుండగా భూమిలో దాచిపెట్టిన గంధకానికి ఒత్తిడి తగలంటంతో ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఇంటిపైకప్పు చిందర వందరగా అవటంతోపాటు గోడలు నెర్రలిచ్చాయి. ఆ వ్యక్తి ముక్కలుముక్కలై ఛిద్రమై మరణించాడు.

### ఇవిగో గత చేదు అనుభవాలు

- రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో 25ఏళ్ల క్రితం మందుగుండు తయారు చేస్తుండగా పేలుడు సంభవించి తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు.
- కొన్నేళ్ల కిందట ఓల్డ్‌టౌన్‌లోనే ఓ మహిళ తూనికల మందును తయారు చేస్తూ ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడింది.
- ఇసుకపల్లిలోనూ వివిధ రకాల మందులు తయారు చేస్తూ పలువురు గాయాలపాలయ్యారు.

### కొరవడిన అధికారుల నిఘా లోపం

అనుమతులు లేకుండా దీపావళి సామగ్రిని తయారు చేసే వారిపై అధికారుల నిఘా కొరవడింది. గ్రామాల్లో అధికారులు తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా మందుగుండు సామగ్రి తయారవుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో తనిఖీలు చేపట్టి బాణసంచా తయారీ, అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తయారీదారులకు కౌన్సెలింగ్ నిర్వహించటంతో పాటు ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### మైక్ ద్వారా హెచ్చరికలు చేస్తున్నాం



గతంలో జరిగిన అనుభవనాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో మైక్ హెచ్చరికలు చేస్తున్నాం. సిబ్బందితో పేటేరు, ఇసుకపల్లి తదితర ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఉంచాం. ఎవరైనా టపాకాయలు తయారు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జనావాసాలలో టపాకాయలు తయారు చేస్తున్నట్లు తెలిస్తే ప్రజలు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– మల్లికార్జునరావు, పట్టణ సీఐ

### రోడ్లపై గోవులను వదిలితే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: గోవులను, ఇతర పెంపుడు జంతువులను యజమానులు రహదారులపైకి వదిలితే సహించేదిలేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు చెప్పారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై సంచరిస్తున్న గోవులను ప్రత్యేక సిబ్బందితో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గోవులు, ఇతర జంతువులు రహదారులపై సంచరిస్తుండడంతో ఆ మూగజీవాలు గాయాలపాలవ్వటంగానీ, మృత్యువాత పడటంగానీ జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా వాటివల్ల వాహన చోదకులు సైతం గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. జీవాలు రహదారులపై సంచరించకుండా ఇప్పటికే నోటీసులు జారీ చేయటం, పట్టణంలో మైకుల ద్వారా తెలియజేశామని పేర్కొన్నారు. అయినా రహదారులపై సంచరిస్తున్న ఆవులను ప్రత్యేక సిబ్బంది ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, శానిటరి సెక్రటరీ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాడేపల్లిరూరల్ : స్థానికంగా ఉన్న అధికారులకు ఉచిత ఇసుకపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. ఆదివారం తెల్లవారుజామున చిర్రావూరు నుంచి నిషేధిత ఇసుక రిచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో తాడేపల్లి పోలీసులు మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఒక పక్క ఉచిత ఇసుక అంటూ మరో పక్క ట్రాక్టర్లను సీజ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

## రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు హెచ్చరించారు. రేపల్లె పట్టణ, రూరల్ సర్కిల్ ప్రాంతాలలోని రౌడీషీటర్లకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘ ఉంచామన్నారు. అల్లర్లకు పాల్పడినా, సెటిల్మెంట్లో పాల్గొన్నా.. కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరిగినాదానికి సంబంధించిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిరంతరం రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలని సూచించారు. ఆయన వెంట రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జున రావు, సిబ్బంది ఉన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

### రీసర్వేపై గ్రామసభలు

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ నెల 24, 29 నవంబర్ 2వ తేదీలలో గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మేకా శ్రీనివాస రావు ఆదివారం తెలిపారు. 24న గొరిగపూడి, 29న కోనేటిపురం, నవంబర్ 2న పల్లెకోన గ్రామాల్లో ఈ గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సభల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొనాలని, తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని తెలిపారు.

### తెనాలిలో భారీవర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడన ప్రభావం తెనాలిని వీడటం లేదు. ప్రతి రోజు ఉదయం వేసవి తాపం, మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తునే ఉంది. ఆదివారం ఉదయం కూడా ఎండ కాచింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి సుమారు గంట పాటు భారీవర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి.

## మువ్వల సవ్వడి అలరించగా..

తెనాలి: ద్వారక తిరుమలలో దేవస్థానం నిర్వహణలో జరుగుతున్న అశ్వయుజ మాస తిరు కళ్యాణ మహోత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ యువనర్తకి, నృత్యగురువు ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందం కూచిపూడి నృత్యం అభినందనలు అందుకొంది. ఈనెల 13వ తేదీ నుంచి 20 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించారు. చివరిరోజైన ఆదివారం సాయంత్రం తేజస్వి ప్రఖ్య బృందానికి అవకాశం కల్పించారు. ద్వారక తిరుమలలోని కళావేదికపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రఖ్య శిష్యబృందంలోని యనమదల రీతిక, ఆరిశెట్టి ఐశ్వర్య, మునిపల్లి పావని, మునిపల్లి భవానిలు అన్నమాచార్య కీర్తనలకు నృత్యం చేశారు. దేవస్థానం అధికారులు సిబ్బంది నృత్యగురువు తేజస్వి ప్రఖ్య శిష్యబృందానికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



నృత్యప్రదర్శనలో చిన్నారులు

## బాపట్లలో భారీ వర్షం



అసోదివారిపాలెంలో జలమయమైన అంతర్గత రోడ్డు



ముత్తాయపాలెంలో.. ఇలా..



చెరువును తలపిస్తున్న వెదుళ్ళపల్లి పూల మార్కెట్



కాలువను తలపిస్తున్న పిన్నిబోయినవారిపాలెం అంతర్గత రోడ్డు

బాపట్లటౌన్: బాపట్లలో ఆదివారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని పిన్నిబోయినవారిపాలెం, ముత్తాయపాలెం, వెదుళ్ళపల్లి, అసోదివారిపాలెం గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమై కాలువలను తలపిస్తున్నాయి. వెదుళ్ళపల్లి పూలమార్కెట్‌లో కుంటలు ఏర్పడి చెరువులను తలపించేలా ఉన్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వర్షం నీటికితోడు మురుగునీరు తోడై కంటిమీద కనుకులేకుండా పోతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మానవత ఉద్యమ నిర్మాణం అవసరం

వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు

తెనాలి: కులం మతం భాష, ప్రాంతం పేరుతో విడిపోతున్న రోజుల్లో అందరినీ కలిపివుంచే మానవత కోసం ఉద్యమ నిర్మాణం ఎంతో అవసరమని, ఎందరో చైతన్యమూర్తులు నడయాడిన తెనాలి అందుకు నాంది పలకాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. పాఠశాల స్థాయి నుంచి గాడితప్పుతున్న సమాజానికి మానవత్వ భావజాలాన్ని ఎక్కించి, మంచి సమాజ ఆవిష్కరణకు ఎవరికివారు తోడ్పడాలని సూచించారు. మానవత స్వచ్ఛంద సంస్థ, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ సుబ్బారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, పరిపూర్ణ వ్యక్తిత్వంతో ఉండటమే మానవత్వమని చెబుతూ ఈగో ఉన్న మంచి మనిషికి మానవత్వం లేకపోవటం అనర్థమేనన్నారు. ఇతరులను గౌరవించటం, ఆనందంగా జీవించటం, పరోపకారం చేయటం మానవత లక్షణాలుగా చెబుతూ ముందుగా తల్లిదండ్రులు, పెద్దలు వీటిని ఆచరించినపుడు కుటుంబం, తద్వారా సమాజం అనుసరిస్తుందని వివరించారు. సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్థ సభ్యత్వాన్ని వెయ్యికి చేర్చేందుకు సభ్యులు కృషిచేయాలని కోరారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ, సమాజంలో ముందుగా తల్లిదండ్రులు ఆదర్శంగా మారాల్సిన ఆవశ్యకతను సోదాహరణంగా వివరించారు. పట్టణానికి చెందిన మొవ్వ సాంబశివరావు తన కుమార్తె మొవ్వ భవాని జ్ఞాపకార్థం, మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి షేక్ బాబాషరీఫ్‌కు ఒక ఏడాదికయే ఖర్చు రూ.55 వేల ఆర్థికసాయం మానవత ద్వారా అందజేశారు. సాంబశివరావు కుమారుడు హేమంత్‌కుమార్, ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు పాల్గొన్నారు.



వైద్యవిద్యార్థికి రూ.55 వేల ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

# వీధి శునకాల సేవకుడు

- వీధి శునకాల సేవలో దైవసేవకుడు
- కరోనా లాక్‌డౌన్‌లో జాలితో ఆహారం అందించారు
- ఆ తృప్తితో నిత్యకృత్యం చేసుకున్నారు
- రోజూ రెండుపూటలా శునకాలకు ఆహారం

తెనాలి: నిత్యావసరాల కోసం రోజులో నాలుగైదు గంటలకు కర్ఫ్యూ సడలింపు. ఒకపక్క కరోనా భయం...కొద్దిపాటి వ్యవధిలోనే కావాల్సినవన్నీ తెచ్చుకోవటం...తలుపులు మూసుకుని ఇంట్లోనే కాలక్షేపం చేయటం...కరోనా లాక్‌డౌన్ తొలిదశ లాక్‌డౌన్ నాటి పరిస్థితి ఇది. ఎవరికివారు పూటగడిచేందుకు దేవుణ్ణి ప్రార్థిస్తున్న రోజుల్లో మూగజీవాల సంగతేంటి? వాటికీ ఆకలి వేస్తుందిగా...! ఆహారం ఎవరిస్తారు?...అని క్రైస్తవ దైవసేవకుడు ఒకరికి కలిగిన ఆలోచన ఇది. అనుకున్నదే తడవుగా ఇంట్లో ఆహారం చేయించి, దారిలో కనిపించిన వీధికుక్కలకు ఇస్తూ వెళ్లాడు. ఎగబడి తిన్న ఆ శునకాల కళ్లలో కనిపించిన కృతజ్ఞతను చూసి, మూగజీవాల ఆకలి దప్పులు తీర్చటాన్ని నిత్యకృత్యం చేసుకున్నారాయన. గాయపడిన పక్షులు, శునకాలకూ వైద్యం, ఆహారం అందిస్తున్నారు. ఆ తర్వాతనే తాను భోజనం చేయటానికి అలవాటుపడ్డారు.

**వైద్యసేవలు సైతం..**

ఆకలి తీర్చటంతోనే కాకుండా ఏదొక కారణంతో గాయాలపాలైన పక్షులు, వీధికుక్కలనూ శ్రీనివాసరావు సంరక్షిస్తున్నారు. గాయాలకు వైద్యం చేయించి, కోలుకునేవరకు ఆహారం ఇస్తున్నారు. ఇది తెలిసిన స్థానికులు, ఆపదలో ఉన్న మూగజీవుల సమాచారాన్ని శ్రీనివాసరావుకు చేరవేస్తున్నారు. 'లాక్‌డౌన్ కాలంలో ఇంటికి సమీపంలో ఓ కుక్క నీరసంగా పడుకొని ఉండటాన్ని గమనించి, ఆహారం ఇవ్వటంతో ఉత్సాహంగా లేచికూర్చొంది' అని శ్రీనివాసరావు గుర్తుచేసుకున్నారు. ఆరోజునుంచే ప్రతిరోజూ 30–40 వీధికుక్కలకు ఆహారం పెడుతున్నానని చెప్పారు. గాయపడిన పక్షులు, కుక్కలకు వైద్యం చేయించి, సంరక్షిస్తున్నానని తెలిపారు. గాయాల్నుంచి కోలుకున్న పావురం కూడా అక్కడుంది. శ్రీనివాసరావు భార్య, డిగ్రీ చదువుతున్న ఇద్దరు పిల్లలు కూడా ఆయన సేవలకు సహకరిస్తుండటం విశేషం. కాలనీలో పలువురికి శ్రీనివాసరావు సేవ నచ్చటం లేదు. వాటిని పోగేస్తున్నావంటూ ఒక్కోసారి ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారనీ బాధపడుతుంటారు.



వీధికుక్కలకు ఆహారం అందిస్తున్న శ్రీనివాసరావు

### వీధి కుక్కలకు ప్రతిరోజూ ఆహారం..

ఆయన పేరు వంకమామిడి శ్రీనివాసరావు. తాతలు, తండ్రులది బొద్దులూరిపాడు అగ్రహారం. తెనాలిలోనే జన్మించిన శ్రీనివాసరావు క్రైస్తవ మతం స్వీకరించి 1991 నుంచి దైవసేవకుడి (పాస్టర్)గా ఉన్నారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో అద్దెఇంట్లో నివసిస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి ఇంట్లో వండించిన ఆహారం, పాలు, బిస్కెట్లు తీసుకుని తన ఇంటి దగ్గరి సెంటరుతో సహా కాలనీలో మూడుచోట్ల వీధికుక్కలకు ఆహారం ఇస్తున్నారు. వాటి సంతానానికి పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. వర్షం కురుస్తున్నా, తుపాన్ హెచ్చరికలున్నా సరే! ఆహారం ఇవ్వాల్సిందే. శ్రీనివాసరావు కోసం వీధి శునకాలు ఎదురు చూస్తుంటాయ్. ఆహారం బకెట్‌ను తగిలించుకుని వచ్చే బైక్ హారన్ శబ్దం వినటం ఆలస్యం... ఎక్కడెక్కడ మునగదీసుకుని పడుకున్న శునకాలన్నీ పరుగున వచ్చి, ఆయన్ను చుట్టుముడతాయ్. వాటన్నిటినీ ప్రేమగా పలకరిస్తూ, ఆహారం పెడతారాయన. వెజిటేరియన్‌తోనే సరిపెట్టకుండా, అప్పుడప్పుడూ నాన్‌వెజ్ వంటకాల రుచులనూ ఆస్వాదిస్తున్నాయి.



వీధికుక్కల ఆలన చూస్తూ..

**•24 నుంచి మహిమ పండుగలు**

తెనాలిరూరల్: పట్టణ ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఈ నెల 24 నుంచి 27 వరకు మహాదేవుని మహిమ పండుగలు నిర్వహించనున్నట్టు బ్రదర్ ఆనందన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రాత్రి ఏడు గంటలకు సువార్త సభలు ప్రారంభమవుతాయన్నారు. ఈ మేరకు పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించామన్నారు.